# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 31 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో భారీ పోలింగ్

- 80 శాతం ఓటింగ్ నమోదు..

ఫిబ్రవరి 10న ఓట్ల లెక్కింపు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో భారీ ఎత్తున పోలింగ్ నమోదైంది. 23 సభ్యుల పదవుల కోసం మొత్తం 203 మంది న్యాయవాదులు పోటీ పడగా, ఇందులో ఐదు స్థానాల కోసం 55 మంది మహిళా న్యాయవాదులు బరిలోకి దిగారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కోర్టు ప్రాంగణాల్లో 109 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

భారీ బందోబస్తు మధ్య నిర్వహించిన ఈ ఎన్నికల్లో సుమారు 80 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఏడేళ్ల తర్వాత బార్ కౌన్సిల్ ఎన్నికలు జరగడంతో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. దీంతో అనేక చోట్ల కోలాహల వాతావరణం నెలకొంది. ఎన్నికల నేపథ్యంలో చాలా మంది న్యాయవాదులు కోర్టు విచారణలకు హాజరుకాలేకపోవడంతో, వ్యతిరేక ఉత్తర్వులు వెలువడకుండా కోర్టులు కేసుల విచారణను వాయిదా వేశాయి. ఎన్నికల ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 10న నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# మేడారంకు పోటెత్తిన భక్తులు


- మేడారం మహాజాతరలో రికార్డు స్థాయిలో భక్తుల వెల్లువ
- మూడో రోజుకు 1.5 కోట్లకు పైగా యాత్రికులు
- సమ్మక్క సారలమ్మలకు దర్శించుకుని నిలువెత్తు బంగారం సమర్పించిన గవర్నర్
- గద్దెలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న డీజీపీ
- సీసీ కెమెరాల ద్వారా జాతరను పరిశీలించిన డీజీపీ
- నేడు చివరి రోజు.. వనంలోకి అమ్మవార్లు



**బలగం టీవి, మేడారం**

ప్రపంచ ప్రఖ్యాత మేడారం సమ్మక్క--సారలమ్మ మహాజాతర ముగింపు దశకు చేరుకుంటున్న వేళ భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. దేశంలోనే అతిపెద్ద గిరిజన ఆధ్యాత్మిక సమ్మేళనాల్లో ఒకటిగా నిలిచిన ఈ జాతర ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. చారిత్రక మహాజాతర సందర్భంగా మేడారం ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రమై మారింది. తెలంగాణతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది భక్తులు తరలివచ్చి అడవిదేవతలైన సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు చెల్లిస్తున్నారు. పసుపు, కుంకుమ, బెల్లం, బియ్యం, వస్త్రాలు వంటి సంప్రదాయ కానుకలను భక్తులు సమర్పిస్తూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తున్నారు.

లక్షలాది మంది భక్తులు హాజరైనా దర్శనాలు క్రమబద్ధంగా, ప్రశాంతంగా సాగుతున్నాయి. పటిష్టమైన క్యూ లైన్ నిర్వహణ, సమర్థవంతమైన జనసంచార నియంత్రణతో భక్తులు ఎలాంటి అసౌకర్యం లేకుండా గద్దెల వద్దకు చేరుకుంటున్నారు. భక్తి శ్రద్ధలతో దీక్షలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉద్ధీపింపజేస్తున్నారు. భారీగా తరలివస్తున్న భక్తులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖలు విస్తృత ఏర్పాట్లు చేపట్టాయి. ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, జనసమూహ పర్యవేక్షణను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. జంపన్నవాగు వద్ద పవిత్ర స్నానాలు భద్రతా పర్యవేక్షణలో నిర్వహించబడుతూ జాతరకు ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యం సంతరించుకుంటోంది.



### వైద్య సేవలు, వాలంటీర్ల సేవలు

జాతర ప్రాంతమంతటా వైద్య బృందాలను ఏర్పాటు చేసి తక్షణ చికిత్స అందిస్తున్నారు. క్యూ లైన్లు, ముఖ్య కూడళ్ల వద్ద వాలంటీర్లు భక్తులకు సహకరిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల కోసం ప్రత్యేక రిస్పాన్స్ వ్యవస్థను సిద్ధం చేశారు. వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవలందిస్తున్నారు. గద్దెల వద్ద సహాయం, క్యూ లైన్లలో మార్గనిర్దేశం, జంపన్నవాగు వద్ద గుంపుల నియంత్రణ, తప్పిపోయిన కుటుంబ సభ్యులను కలిపే బాధ్యతలు వారు నిర్వర్తిస్తున్నారు. జాతర ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి దర్శనం వేగంగా, మెరుగైన నిర్వహణతో సాగుతోందని పలువురు పేర్కొన్నారు. పారిశుధ్యం, భద్రత, వైద్య సేవలు, వాలంటీర్ల సమన్వయం మెరుగ్గా ఉన్నాయని ప్రశంసించారు.

### ప్రముఖుల సందర్శన

మహాజాతరకు పలువురు ప్రముఖులు హాజరై సమ్మక్క--సారలమ్మలను దర్శించుకున్నారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి సంప్రదాయ కానుకలు సమర్పించారు. మంత్రి దనసరి అనసూయ (సీతక్క), అటవీ--పర్యావరణ--దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బాలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సరయ్య, ఎమ్మెల్యే నైనీ రాజేందర్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్యనారాయణ తదితరులు మొక్కులు చెల్లించారు. అలాగే మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, డీజీపీ శివధర్ రెడ్డి కూడా జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### మేడారం మహాజాతరలో రికార్డు స్థాయిలో భక్తుల వెల్లువ

నాలుగు గిరిజన దేవతలు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు ఒకే రోజు గద్దెలపై కొలువుదీరిన శుభశుక్రవారం మేడారం అడవి ప్రాంతం జనసముద్రంగా మారింది. మహాజాతర సందర్భంగా భక్తుల రాక రికార్డు స్థాయికి చేరింది. అధికారిక అంచనాల ప్రకారం జాతర మొత్తం పాదయాత్రికుల సంఖ్య 1.5 కోట్లను దాటగా, రాష్ట్ర ప్రభుత్వం ముందుగా అంచనా వేసిన 1 కోట్ల సంఖ్యను ఇది ఎంతో మించిపోయింది. శుక్రవారం ఒక్కరోజే దాదాపు 50 లక్షల మంది భక్తులు జాతరకు హాజరయ్యారు.

అడవులంతా 'సమ్మక్కో.. సారక్కో..' నినాదాలతో మార్మోగాయి. వేలాది మంది శివసత్తులు సంప్రదాయ లయలో ఒణికిపోతూ దైవావేశానికి లోనయ్యారు. తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పసుపు, కుంకుమతో పాటు తమ బరువుకు సమానంగా బెల్లం, చీరలు, రవికల గుడ్డలు, గాజులు, కొబ్బరికాయలు, ఒడి బియ్యం వంటి సంప్రదాయ కానుకలను సమర్పించారు. జంపన్నవాగు వద్ద పవిత్ర స్నానాలు చేసేందుకు నిరంతరంగా భక్తుల రాక కొనసాగింది. స్నానానంతరం గద్దెల వద్దకు చేరుకుని దేవతలను దర్శించుకోవడంతో జాతర ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకుంది.

మహాజాతర ప్రాధాన్యాన్ని చాటుతూ రాజ్యాంగాధినేతలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో పాటు అంతర్జాతీయ దౌత్యవేత్తలు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు హెలికాప్టర్ల ద్వారా మేడారానికి చేరుకుని సమ్మక్క--సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గద్దెల వద్ద బంగారం (బెల్లం) సమర్పించి, శతాబ్దాలుగా గిరిజన సంప్రదాయాలను కాపాడుతున్న పూజారులను ప్రశంసించారు. భారీ జనసందోహం మధ్య వీరందరికీ సురక్షిత మార్గం కల్పించేందుకు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.

### నేడు వనప్రవేశం

శనివారం మహాజాతర తుదిదశకు చేరుకోనుంది. గిరిజన సంప్రదాయాల ప్రకారం వనప్రవేశం కార్యక్రమంతో దేవతలు తిరిగి అడవులకు చేరనున్నారు. నాలుగో రోజైన శనివారం ముగింపు పూజలు నిర్వహించిన అనంతరం సమ్మక్క చిలకలగుట్ట లోతైన అడవులకు, సారలమ్మ కన్నేపల్లి దేవాలయానికి, పగిడిద్దరాజు పెనుకొండకు, గోవిందరాజు కొండాయికి వెళ్లనున్నారు. ఈ కార్యక్రమాలతో రెండేళ్లకొకసారి జరిగే మహాజాతర అధికారికంగా ముగియనుంది.

## అర్ధాంత రంగా ముగిసిన కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం

- ఎజెండాలో పోలవరం - నల్లమల సాగర్ మినహా 12 అంశాలు చేర్చాలి
- తెలంగాణ ప్రతిపాదన
- ఎజెండా లేకుండానే హాజరైన ఏపీ
- వారంలో ప్రతిపాదనలు ఇవ్వాలని ఏపీకి సీడబ్ల్యూసీ చైర్మెన్ సూచన
- అంశాలు ఖరారయ్యాకే తదుపరి భేటీ అని తేల్చిన కమిటీ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీ జల వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశం అర్ధాంత రంగా ముగిసింది. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) చైర్మెన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం ఢిల్లీలో రెండు గంటలపాటు జరిగిన సమావేశంలో ఎలాంటి ముంద డుగు పడలేదు. ఎజెండాలో 12 అంశాలు చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. పోలవరం, నల్లమల సాగర్ ప్రాజెక్టును ఎజెండాలో చేర్చొద్దని కోరింది. క్రిష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యూనల్-2(కేడబ్ల్యు డీటీ) తీర్పు వచ్చే వరకు కృష్ణా నీటిలో 50 శాతం నీటిని వాడుకునే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. రెండు రాష్ట్రాల మధ్య నదీ జలాలకు సంబంధించి అనేక సమస్య లు, వివాదాలు కొనసాగుతున్నాయనీ, వాటన్నింటిని ఎజెండాలో లిఖిత పూర్వకంగా కమిటీలో ప్రస్తావించామని తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ మీడియాకు తెలిపారు. అయితే ఏపీ అధికారులు ఎలాంటి ఎజెండా లేకుండా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ చేసిన ప్రతిపాదనలకు సైతం వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న సీడబ్ల్యూ సీ చైర్మెన్ వారంలోగా ఎజెండా అంశాలు ఖరారు చేసి లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఏపీకి సూచించా రు. అంశాలు ఖరారయ్యాక భేటీ తేదీని నిర్ణయిస్తా మని ఆయన ఇరు రాష్ట్రాలకు తెలియజేశారు.

తెలంగాణ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ మాట్లాడుతూ ఏపీ నిర్మించతలపెట్టిన పోలవరం-నల్లమల సాగర్ అంశాన్ని కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ ఎజెండాలో చేర్చొద్దని స్పష్టం చేశామన్నారు. ఈ అంశంపై ఇప్పటికే కేంద్రానికి లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలకు సంబంధించి చర్చించే ఎజెండాను నిర్ణయించేందుకే మొదటి సమావేశం జరిగిందన్నారు. కేవలం గోదావరి, కృష్ణా నీటి వివాదాలకు సంబంధించి అంతర్రాష్ట్ర అంశాలపై ఈ సమావేశం జరిగిందని తెలిపారు. అయితే ఆంధ్రప్రదేశ్ తరపున తొలి సమావేశంలో ఎలాంటి ప్రతిపాదనలు ఇవ్వలేదని, వారంలో సమర్పిస్తామని ఏపీ అధికారులు చెప్పినట్లు రాహుల్ బొజ్జ తెలిపారు. అయితే ఏపీ ప్రతిపాదనలు ఇచ్చాకే సీడబ్ల్యూసీ అంశాల వారీగా ఎజెండా నిర్ణయిస్తుందని, వాటి ఆధారంగా కమిటీ రెండో సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ప్రస్తుతం కృష్ణా, గోదావరి నది జలాలకు సంబంధించి మొత్తం కేటాయింపులపై ట్రిబ్యునల్‌లో వాదనలు జరుగుతున్నాయని రాహుల్ బొజ్జా తెలిపారు. ఒకవేళ కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీలో ఈ సమస్యలను పరిష్కరించుకోగలిగితే, సుప్రీంకోర్టు, ట్రిబ్యునల్ నుంచి అభ్యంతరాలను వెనక్కి తీసుకోవచ్చన్నారు. ఈ సమావేశానికి సీడబ్ల్యూసీ అధికారులు, కృష్ణానది యాజమాన్య మండలి (కేఆర్ఎంబీ), గోదావరి నది యాజమాన్య మండలి (జీఆర్ఎంబీ), నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మెన్లు, కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీర్, తెలంగాణ నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, కేంద్ర రాష్ట్ర సమన్వయ అధికారి గౌరవ్ ఉప్పల్, ఏపీ జలవనరుల శాఖ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి తదితరులు హాజరయ్యారు.

## గోదావరి జలాల్లో తెలంగాణకు ద్రోహం




- ఢిల్లీలో ఇరిగేషన్ మీటింగ్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు మరణశాసనం రాస్తోంది
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గోదావరి జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర ద్రోహం జరుగుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఇరిగేషన్ సమావేశాన్ని సాక్షిగా తీసుకొని, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు మరణశాసనం రాస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఢిల్లీ కేంద్రంగా తెలంగాణకు జరుగుతున్న జలద్రోహాన్ని ప్రజలకు వెల్లడించేందుకే ఈ ప్రెస్‌మీట్ నిర్వహించానని హరీశ్‌రావు తెలిపారు. తప్పు జరిగితే తెలంగాణ నీటి చరిత్రలో ఈ రోజు ఒక 'బ్లాక్ డే'గా మిగిలిపోతుందన్నారు.

### "జలద్రోహంపై కాంగ్రెస్ కుట్ర"

హరీశ్‌రావు మాట్లాడుతూ..గోదావరి జలాల అక్రమ తరలింపు విషయంలో బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రమత్తం చేస్తూనే ఉందన్నారు. అనేకసార్లు ప్రెస్‌మీట్లు పెట్టి వాస్తవాలు బయటపెట్టినా, ప్రభుత్వం బ్యాక్‌డేటెడ్ లేఖలు విడుదల చేసి చేతులు దులుపుకుంటోందని విమర్శించారు "బనకచర్ల అయినా, నల్లమల సాగర్ అయినా పేరు మాత్రమే మారింది. కానీ ఏపీ జలదోపిడీ ఆగలేదు. జలద్రోహంలో కత్తి చంద్రబాబుదైతే, పొడిచేది రేవంత్‌రెడ్డి" అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.పోలవరం--నల్లమల సాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం పద్ధతి ప్రకారమే ఏపీకి సహకరిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు."ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ చేశారు. పెట్టబోమంటూనే సంతకం పెట్టి తెలంగాణ నదీ జల హక్కులను కాలరాశారు. వేయనంటూనే కమిటీ వేసి ఏపీ జలదోపిడీకి రెడ్ కార్పెట్ వేశారు. టెండర్ గడువు ముగిశాక సుప్రీంకోర్టుకు వెళ్లి నల్లమల సాగర్‌కు పరోక్షంగా మద్దతిచ్చారు" అని అన్నారు.

రేవంత్‌రెడ్డి ప్లాన్‌డ్‌గా చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్నారని విమర్శించారు. పేరుకే జలవివాదాల సమావేశమని, వాస్తవానికి తెలంగాణకు చెందిన 200 టీఎంసీల నీటిని ఏపీ తరలించుకుపోయే నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై కుట్ర జరుగుతోందన్నారు. గతంలో రెండు షరతులు నెరవేరిస్తేనే ఢిల్లీ సమావేశానికి వస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం లేఖ రాసిందని గుర్తు చేశారు. మొదటి షరతు నల్లమల సాగర్ డీపీఆర్‌ను తక్షణం నిలిపివేయాలని, రెండో షరతు ప్రీ-ఫీజిబిలిటీ రిపోర్టును ఆపుతామని ఏపీ హామీ ఇవ్వాలని పేర్కొన్నారు. "ఈ రెండు షరతులకు కేంద్రం గానీ, ఏపీ గానీ హామీ ఇచ్చాయా? హామీ లేకుండా మీటింగ్‌కు ఎందుకు వెళ్లారు?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ సమావేశానికి తెలంగాణ తరపున పంపిన అధికారి గతంలో కాళేశ్వరం, సీతారామ లిఫ్ట్, మిషన్ భగీరథ తదితర ప్రాజెక్టులను అక్రమమని వ్యాఖ్యానించిన వ్యక్తేనని గుర్తుచేశారు. "తెలంగాణ ప్రాజెక్టులను అడుగడుగునా వ్యతిరేకించిన వ్యక్తిని ఇరిగేషన్ మీటింగ్‌కు పంపడం తెలంగాణ ద్రోహం చేయడమే కాదా?" అని హరీశ్‌రావు నిలదీశారు. మొత్తంగా ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలు తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే తన వైఖరిని మార్చుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## కేసీఆర్‌కు మరోసారి సిట్ నోటీసులు

- ఫిబ్రవరి 1న నందినగర్ నివాసంలోనే విచారణ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఆయన నందినగర్ నివాసంలోనే ఈ నోటీసులను అందజేశారు. ఫిబ్రవరి 1వ తేదీ (ఆదివారం) మధ్యాహ్నం 3 గంటలకు నందినగర్ నివాసంలో విచారణకు అందుబాటులో ఉండాలని సిట్ నోటీసుల్లో స్పష్టం చేసింది.

ఇంతకుముందు సిట్ జారీ చేసిన తొలి నోటీసులకు స్పందించిన కేసీఆర్, తాను మున్సిపల్ ఎన్నికల వ్యవహారాలతో బిజీగా ఉన్నందున నిర్ణీత తేదీన విచారణకు హాజరు కాలేనని లేఖ రాసిన విషయం తెలిసిందే. అలాగే తనను ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లోనే విచారించాలని, భవిష్యత్తులో నోటీసులు అక్కడికే పంపించాలని కోరారు. అయితే ఈ విజ్ఞప్తిని సిట్ అధికారులు తాజాగా తిరస్కరించారు.



### ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ

శుక్రవారం ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో ఉన్న కేసీఆర్ పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిలతో మున్సిపల్ ఎన్నికలపై చర్చించి, ఎన్నికల వ్యూహాలపై వారికి దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. .

సిట్ తాజా నోటీసులపై కేసీఆర్ ఏ విధంగా స్పందిస్తారన్నదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ఈ కేసులో బీఆరెస్ మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, అలాగే ఎంపీ జోగినపల్లి సంతోష్‌లను సిట్ అధికారులు విచారించిన విషయం తెలిసిందే.

## ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ ఫిబ్రవరి18కి వాయిదా

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణను ఫిబ్రవరి 18కి వాయిదా వేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యే నాగేందర్‌పై స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం పిటిషన్లపై న్యాయవాదలు తమ వాదనలు వినిపించాల్సి ఉండింది. అయితే కొంత సమయం కావాలని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోరడంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ వచ్చే 18వ తేదీకి వాయిదా వేశారు. విచారణకు పాడికౌశిక్‌రెడ్డి హాజరుకాగా, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రాలేదు. అలాగే దానం నాగేందర్ సైతం హాజరు కాలేదు. పాడి కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 'మేం ఇచ్చిన నోటీసులపై విచారణ కోసం స్పీకర్ దానం నాగేందర్‌ను పిలిపించారు. ఆయనపై సభాపతి అనర్హత వేటు వేస్తారని నమ్ముతున్నాం' అని అన్నారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేశారని.. దానం పోటీ చేసిన దానికంటే పెద్ద ప్రూఫ్ ఏముంటుంది? అని ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేననీ, వారి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందన్నారు. మున్సిపల్ ఎన్నికల హడావిడి ఉన్నప్పటికీ, తాను హాజరైనట్టు తెలిపారు. దానం నాగేందర్ అసెంబ్లీ ఆవరణకు వచ్చినా, స్పీకర్ కోర్టుకు రాలేదు. కాగా.. గత అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున సికింద్రాబాద్ నుంచి ఎంపీగా బరిలోకి దిగారు. దీంతో ఆయన బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. దానంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డిలు పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటికే దానం నాగేందర్ తన న్యాయవాదుల ద్వారా స్పీకర్‌కు కౌంటర్ దాఖలు చేశారు. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నాననీ, పార్టీకి రాజీనామా చేయలేదనీ, బీఆర్ఎస్ తనను సస్పెండ్ చేయలేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో దానం నాగేందర్ విషయంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

## తగ్గిన బంగారం, వెండి ధరలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బులియన్ మార్కెట్‌లో తీవ్ర ఒడిదుడుకులు కనిపిస్తున్నాయి. ఇటీవల దేశీయంగా ఆల్‌టైమ్ హై రికార్డులతో దూసుకుపోయిన బంగారం, వెండి ధరలు శుక్రవారం ఒక్కసారిగా భారీగా క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్ నుంచి బలహీన సంకేతాలు రావడం, అమెరికా డాలర్ తిరిగి బలపడటంతో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపినట్లు మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) బంగారం 10 గ్రాముల ధర ఒక్కరోజే రూ.14,000 (7.65 శాతం) తగ్గి రూ.1,69,000 (అన్ని పన్నులతో సహా) వద్ద స్థిరపడింది. గురువారం రూ.12,000 పెరిగి చరిత్రలో తొలిసారిగా రూ.1,83,000కు చేరిన విషయం తెలిసిందే.అదే విధంగా వెండి ధర కిలోకు ఏకంగా రూ.20,000 (దాదాపు 5 శాతం) పడిపోయి రూ.3,84,500 (అన్ని పన్నులతో సహా) వద్ద నిలిచింది. అంతకుముందు రోజు రూ.19,500 పెరిగి రూ.4,04,500 చారిత్రక గరిష్ఠాన్ని తాకింది.

## మున్సిపల్ ఎన్నికలకు 28,456 నామినేషన్లు

- ఫిబ్రవరి 11న 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు పోలింగ్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు గాను రాత్రి 10 గంటల వరకు అందిన సమాచారం మేరకు మొత్తం 28,456 నామినేషన్లు స్వీకరించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. జనవరి 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు నామినేషన్ ప్రక్రియ కొనసాగింది.నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) అనంతరం శనివారం అర్హత కలిగిన అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. తిరస్కరణపై దాఖలయ్యే అప్పీల్స్‌ను పరిశీలించి, వాటిపై నిర్ణయం తీసుకున్న తర్వాత తుది పోటీ అభ్యర్థుల జాబితాను ఫిబ్రవరి 3న విడుదల చేయనున్నారు.

ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల యంత్రాంగం ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉండనుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం శనివారం రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. ఉదయం నుంచే నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు క్యూ కట్టారు. దాంతో 5 గంటల లోపు వచ్చిన వారికి రిటర్నింగ్ అధికారులు అవకాశం కల్పించారు. చివరి రోజు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలోని అందోల్- జోగిపేట, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇంద్రేశం, ఇస్నాపూర్, జిన్నారం, కోహీర్, నారాయణఖేడ్, సదాశివపేట, సంగారెడ్డి, జహీరాబాద్ మున్సిపాల్టీల్లో 2,200 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆ తర్వాత కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాల్టీల్లో 1,947, నల్లగొండ కార్పొరేషన్‌తో పాటు చండూర్, చిట్యాల, దేవరకొండ, హాలియా, మిర్యాలగూడ, నందికొండ మున్సిపాల్టీల్లో 1,795, సూర్యాపేట జిల్లాలో హుజుర్‌నగర్, కోదాడ, నేరేడుచర్ల, సూర్యాపేట, తిరుమలగిరి మున్సిపాల్టీల్లో 1,617 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల సంఘం తెలిపింది.

మున్సిపల్ ఎన్నికల్లో దాఖలైన నామినేషన్లను నేడు పరిశీలించనున్నారు. అనంతరం చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితాను ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో ప్రచురిస్తారు. తిరస్కరణకు గురైన నామినేషన్లపై అభ్యర్థి సంబంధిత రెవెన్యూ డివిజనల్, సబ్ కలెక్టర్ వద్ద రిటర్నింగ్ అధికారిపై ఫిబ్రవరి 1న అప్పీల్ చేసుకోవచ్చు. ఫిబ్రవరి 2న అప్పీళ్లను పరిష్కరిస్తారు. ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు తుది జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఉదయం 8గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటించనున్నారు.

## క్షమాపణలు చెప్పిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

- మనోభావాలు దెబ్బతింటే మన్నించాలి: ఎక్స్ వేదికగా వీడియో విడుదల

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**


తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి క్షమాపణలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా వీడియో విడుదల చేస్తూ తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. ఎవరినీ ఉద్దేశపూర్వకంగా దూషించే ఉద్దేశం తనకు లేదని, తన మాటల వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే క్షమించాలని ఆయన అన్నారు.తనపై, తన కుటుంబంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రోద్భలంతో రాజకీయ కక్ష కొనసాగుతోందని ఆరోపించారు. అయితే పోలీస్ శాఖ, అధికారులు అంటే తనకు ఎంతో గౌరవముందని స్పష్టం చేశారు. సమ్మక్క జాతరకు వెళ్తున్న సమయంలో కొందరు అధికారులు అడ్డుకుని తీవ్ర ఒత్తిడికి గురిచేశారని, ఆ ఫ్రస్టేషన్, ఒత్తిడిలో తెలియక నోరు జారిందని చెప్పారు. "అవి ఉద్దేశపూర్వకంగా చేసిన వ్యాఖ్యలు కావు. నా మాటలతో ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే వారికి నా క్షమాపణలు" అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని అందరినీ కోరుతున్నట్లు కౌశిక్‌రెడ్డి తెలిపారు.

## హార్వర్డ్‌లో లీడర్‌షిప్ కోర్సు పూర్తి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

- హార్వర్డ్ కెన్నడీ స్కూల్‌లో లీడర్‌షిప్ ఎగ్జిక్యూటివ్ కోర్సు పూర్తి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అరుదైన ఘనత సాధించారు. అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెన్నడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో నిర్వహించిన »Leadership for the Twenty-First Century' ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా హార్వర్డ్ కెన్నడీ స్కూల్ నుంచి సర్టిఫికెట్ అందుకున్న విషయాన్ని సీఎం స్వయంగా తన ట్విట్టర్/ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ కోర్సు జనవరి 25 నుంచి 30, 2026 వరకు నిర్వహించబడింది. ప్రపంచవ్యాప్తంగా 20 దేశాల నుంచి ఎంపికైన 60 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రాక్టికల్ లీడర్‌షిప్, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్‌పై ప్రత్యేక దృష్టితో ఈ కోర్సును రూపొందించారు.




ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్ చేస్తూ, "హార్వర్డ్ కెన్నడీ స్కూల్‌లోని ప్రతికూల వాతావరణంలోనే ఈ కోర్సును పూర్తి చేశాను. అద్భుతమైన అధ్యాపకులు, వివిధ దేశాల నుంచి వచ్చిన తోటి విద్యార్థుల ద్వారా అమూల్యమైన పాఠాలు నేర్చుకున్నాను" అని పేర్కొన్నారు. సీఎం హార్వర్డ్‌లో లీడర్‌షిప్ కోర్సు పూర్తి చేయడం రాష్ట్ర రాజకీయ, పరిపాలనా వర్గాల్లో విశేష చర్చనీయాంశంగా మారింది.

## యువకుల వేధింపులు... మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

- **నిందితులపై కేసు నమోదు..**



**బలగం టీవీ, వరంగల్**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వరంగల్ జిల్లా పర్వతగురి మండలం సీత్యతండా నివాసి అనిత ఆత్మహత్యకు సంబంధించి పోలీసులు ప్రాథమిక విచారణ పూర్తి చేసి నిందితులపై కేసు నమోదు చేశారు. వివరాలోకి వెళ్తే.. మృతురాలు అనితను గత నాలుగేళ్లుగా మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కొమ్మనపల్లి తండాకు చెందిన రాజేందర్ అనే యువకుడు పెళ్లి పేరుతో వేధింపులకు గురిచేస్తున్నాడు. విధుల్లో ఉన్న సమయంలోనూ ఆమె స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ, వీడియో కాల్స్ చేయాలని ఒత్తిడి చేసేవాడు. రాజేందర్ ప్రవర్తన సరిగా లేకపోవడంతో మృతురాలి కుటుంబ సభ్యులు వీరి వివాహాన్ని నిరాకరించారు. ఈ క్రమంలో, అనిత తన స్నేహితుడైన జబ్బార్ లాల్‌తో సన్నిహితంగా ఉంటుందని గమనించిన రాజేందర్, జబ్బార్ లాల్‌కు ఫోన్ చేసి ఆమెపై తప్పుడు ప్రచారం చేశాడు. దీంతో జబ్బార్ లాల్ కూడా అనితను ఆర్థికంగా మరియు మానసిక వేధింపులకు గురిచేయడం ప్రారంభించాడు. తనకు డబ్బు ఇస్తేనే పెళ్లి చేసుకుంటానని వేధించాడు. నిందితుల వేధింపులు భరించలేక అనిత రాజేందర్‌కు ఫోన్ చేసి తన ఆవేదన వ్యక్తం చేయగా, అతను అత్యంత అమానవీయంగా “చస్తే చావు” అని సమాధానం ఇచ్చాడు. ఈ మానసిక క్షోభతో అనిత గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితులు రాజేందర్ మరియు జబ్బార్ లాల్ పై ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం జరిగింది. నిందితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు. బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు స్పష్టం చేశారు

## బొప్పాపూర్‌లో వైభవంగా సమ్మక్క-సారలమ్మ జాతర..

- **అమ్మవార్లను దర్శించుకున్న జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండా రపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణ హరి**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో సమ్మక్క-సారలమ్మ జాతర మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం నాడు సెస్ (జజురూ) డైరెక్టర్ వరుస కృష్ణ హరి, జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణా రెడ్డి విచ్చేసి అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా వారు గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గిరిజన సంస్కృతికి ప్రతీకగా నిలిచే సమ్మక్క-సారలమ్మల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసిన గ్రామ పంచాయతీని, జాతర కమిటీని వారు అభినందించారు. సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి మరియు ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి వార్డ్ నెంబర్లు కొత్త ప్రసాదు, చంద్రం, బొమ్మవేని కృష్ణ, బొమ్మనేని వెంకటేష్, మరియు దూస శీను, హసన్ భాయ్ నవ సంజీవ్ రెడ్డి, బంటి, సింగారం మధు, తదితరులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

## కేసీఆర్‌కు నోటీసులివ్వడం శోచనీయం..

- **కేసీఆర్‌కు నోటీసులు రాజకీయ కక్ష సాధింపునకు పరాకాష్ఠ**
- **ఇది ముమ్మాటికీ ‘డైవర్షన్ పాలిటిక్స్’**
- **బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,**



**బలగం టీవీ, హైదరాబాద్:**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీ చేయడంపై రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది రాజకీయ కక్ష సాధింపునకు పరాకాష్ట అని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత కొంతకాలంగా జరుగుతున్న సిట్ విచారణ తీరును చూస్తుంటే టీవీ సీరియల్‌ను తలపిస్తోందని ఎంపీ రవిచంద్ర ఎద్దేవా చేశారు. ఎటువంటి సంబంధం లేని కేసులో కేసీఆర్‌ను ఇరికించాలని చూడటం దుర్మార్గమని మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే రేవంత్ సర్కార్ ఈ తరహా ‘డైవర్షన్ పాలిటిక్స్’ చేస్తోందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అవినీ తిలో కూరుకుపోయిందని, అనేక కుంభకోణాల మయంగా మారిందని రవిచంద్ర ఆరోపించారు. ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్ష నేతలపై దాడులు చేయడం ఆక్షేపణీయం అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా, పదేళ్ల సుపరిపాలనతో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌ది అని కొనియాడారు. అలాంటి గొప్ప నాయకుడిపై చేస్తున్న దుర్మార్గపు ప్రచారాన్ని ప్రజలు సహించబోరని, సరైన సమయంలో తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. నోటీసులు, విచారణల పేరుతో ఎన్ని ఇబ్బందులు పెట్టినా బీఆర్ఎస్ శ్రేణులు భయపడబోరని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీ అమలు అయ్యే వరకు, కుంభకోణాలపై నిజాలు తేలే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు.

## రేవంత్ సర్కార్‌పై ఓయూ విద్యార్థుల ఆగ్రహం

- **కేసీఆర్‌కు సిట్ నోటీసులు కుట్రే**
- **శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఉస్మానియాలో బీఆర్ఎస్వీ నిరసన.**
- **ఆర్ట్స్ కాలేజీ వద్ద సీఎం దిష్టిబొమ్మ దహనం!**




**బలగం టీవీ, హైదరాబాద్**

కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వేదికగా బిఆర్ఎస్వి నాయకులు భారీ నిరసన చేపట్టారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కి సిట్ (ఠాక్ష్మి) నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, బిఆర్ఎస్వి నాయకుడు శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ.. సింగరేణిలో కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతున్న భారీ అవినీతి, అక్రమాలను బీఆర్ఎస్ పార్టీ ఎండగడుతుందనే భయంతోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కుట్రలకు తెరలేపిందని మండిపడ్డారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్ గారిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ నోటీసులు పంపుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపులే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పై సాగుతున్న ఈ వేధింపులను తెలంగాణ విద్యార్థి లోకం సహించబోదని, రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నోటీసులతో భయపెట్టాలని చూడటం రేవంత్ రెడ్డి అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్వి విద్యార్థి నాయకులు మరియు విద్యార్థులు పాల్గొని ప్రభుత్వం వ్యతిరేక నినాదాలతో క్యాంపస్‌ను హోరెత్తించారు.

## బీజేపీకి భారీ షాక్..

### ఎంపీ వద్దిరాజు, మాజీ విప్ రేగా సమక్షంలో బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు..




**బలగం టీవీ, కొత్తగూడెం:**

బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా కొత్తగూడెంలో భారీ చేరికలు జరిగాయి. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ప్రభుత్వ విప్ మరియు బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు సమక్షంలో భారతీయ జనతా పార్టీకి చెందిన సుమారు 300 మంది కార్యకర్తలు ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు.

బీజేపీ కొత్తగూడెం పట్టణ శాఖ మాజీ అధ్యక్షుడు ఏమునూరి శివకృష్ణ నాయకత్వంలో గాజుల రాజమ్ బస్తీకి చెందిన వందలాది మంది కార్యకర్తలు గురువారం మధ్యాహ్నం స్థానిక తెలంగాణ భవన్‌కు తరలివచ్చారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, రేగా కాంతారావు, శివకృష్ణతో పాటు ఆయన తల్లిదండ్రులు ఏమునూరి లక్ష్మయ్య, లక్ష్మీబాయిలకు మరియు వారి అనుచరులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రముఖులు నర్సింహా, కాళి, మోహన్, నర్సమ్మ, ఫర్జానా, వంశీ, నారాయణ, నవీన్, బిట్టు, ప్రవీణ్, ప్రమోద్‌లతో పాటు పెద్ద సంఖ్యలో మైనారిటీ మహిళలు మరియు యువకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కేసీఆర్ నాయకత్వంపై నమ్మకంతోనే తాము పార్టీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా వారు ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ ప్రాంగణం “జై తెలంగాణ”, “కేసీఆర్ నాయకత్వం జిందాబాద్”, “వర్ధిల్లాలి బిఆర్ఎస్” అనే నినాదాలతో మారుమోగింది. కార్యకర్తలు భారీ ఎత్తున తెలంగాణ భవన్ పరిసరాలు హోరెత్తాయి ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాపు సీతామహాలక్ష్మీ, బండారు రుక్మేందర్, నవతన్, మిట్టపల్లి కిరణ్, అనుదీప్, తురక రాంకోటి తదితరులు పాల్గొన్నారు.

## సత్యం, ధర్మం కేసీఆర్ వైపే.. కాంగ్రెస్ కుట్రలు సాగవు..!

- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి**



**బలగం టీవీ, హైదరాబాద్**

కేసులపేరుతో కాలక్షేపం చేయటం, విచారణలో పేరుతో సమయాన్ని వృధా చేయటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేయడం చేతకావడం లేదు అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి అన్నారు. ‘రాజకీయ కక్ష సాధింపులో భాగంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన భారత రాష్ట్ర సమితి అధినాయకత్వాన్ని వేధించడమే తమ ఏకైక ఎజెండా గా పెట్టుకున్నట్టుంది. రెండేళ్లుగా తమ సర్వశక్తులు దారపోసి కెసిఆర్ గారి వ్యక్తిత్వాన్ని దిగజార్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, వారు ప్రజా ఆశీర్వాదంతో మరింత శిఖరంలా పెరుగుతున్నాడు తప్ప అంగుళం కూడా తగ్గలేదు. సత్యానికి, ధర్మానికి ఉండే సహజ బలంతో కేసీఆర్ కాంగ్రెస్ అరాచకాలను ఎదుర్కొంటున్నాడు. కాంగ్రెస్ అవినీతిని, ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న నాటకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సిట్ కేసీఆర్ ని విచారించడం అంటే వారి దగ్గర నుండి అనేక విషయాల పట్ల అవగాహన పెంచుకోవడానికి సమావేశం అయినట్టే ఉంటుంది తప్ప కేసీఆర్ కి కలిగే నష్టమేమీ ఉండదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు కేసీఆర్ వెంట ఉన్నంత కాలం కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదు. ఇలాంటి ఉడత ఊపులకు, పిట్ట బెదిరింపులకు భయపడే వారు కాదు కేసీఆర్, పెద్ద పెద్ద రాకాసులతోనే కొట్లాడిన చరిత్ర వారిది. ఈ పిల్లాకాకి వేషాలకు వారు సరైన సమయంలో సరైన పద్ధతిలో సమాధానం చెప్తారు’ అని అన్నారు.

## అది రాజకీయ కక్షే..

- **కేసీఆర్ నోటీసులపై తలసాని శ్రీనివాస్ యాదవ్ ఫైర్**



**బలగం టీవీ, హైదరాబాద్**

దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపిన తెచ్చిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గం. ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ తెచ్చినందుకు నోటీసు ఇచ్చారా? అని ప్రశ్నించారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీలను అమలు చేయడం మరిచి డైవర్షన్ రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు. ప్రజల కోసం ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యమం చేసిన నాయకుడిపై ప్రతీకార రాజకీయాలు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని ఆయన పేర్కొన్నారు. పది సంవత్సరాల పాలనలో అద్భుతమైన పథకాలు తీసుకొచ్చి అన్ని వర్గాల ప్రజల అభిమానం పొందిన, గొప్ప పాలనా దక్షుడు కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడం ముమ్మాటికీ రాజకీయ కక్షే అని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్ళు దాటినదని, ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏం మేలు చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని కేసులు పెట్టినా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## తక్కెళ్లపల్లి రవీందర్ రావుపై అనుచిత వ్యాఖ్యలు.. క్షమాపణలు చెప్పిన ఏబీఎన్ యాజమాన్యం..



**బలగం టీవీ, హైదరాబాద్:**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుపై ఏబీఎన్ ఆంధ్రజ్యోతి డిబేట్‌లో యాంకర్ వెంకటకృష్ణ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల పట్ల ఆ సంస్థ యాజమాన్యం విచారం వ్యక్తం చేసింది. ఈ మేరకు అధికారికంగా క్షమాపణలు చెబుతూ ప్రకటన విడుదల చేసింది.

# అప్రమత్తంగా ఉంటూ.. వాహనాలను తనిఖీ చేయాలి..




- సంకేపల్లి, శాత్రాజపల్లి, కోనాయపల్లి ఎస్.ఎస్.టీ చెక్ పోస్టుల తనిఖీ
- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, వేములవాడ:**
మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎస్.ఎస్.టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్) చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

వేములవాడ మున్సిపల్ పరిధిలోని కరీంనగర్ రోడ్డులో ఉన్న సంకేపల్లి, జగిత్యాల రోడ్డులో ఉన్న శాత్రాజపల్లి, కోరుట్ల రోడ్డులో కోనాయపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఎస్.ఎస్.టీ చెక్ పోస్టులను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో నగదు, మద్యం, తరలించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెక్ పోస్టులో నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించి, ఇప్పటివరకు తనిఖీ చేసిన వాహనాల వివరాలు, స్వాధీనం చేసుకున్న వస్తువులు ఉన్నాయా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. వాహనాల తనిఖీ ప్రక్రియ కట్టుదిట్టంగా చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. అలాగే ప్రతి తనిఖీ వివరాలను స్పష్టంగా రిజిస్టర్లలో నమోదు చేయాలని, వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశించారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు చెక్ పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో తహసీల్దార్ జయంత్ కుమార్, రెవెన్యూ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఎస్‌టీ చెక్ పోస్ట్ తనిఖీ చేసిన సాధారణ, వ్యయ పరిశీలకులు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో రగుడు వద్ద ఏర్పాటు చేసిన ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ ను జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రాజ్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ లో ఉన్న సిబ్బంది వద్ద ఉన్న వివిధ రిజిస్టర్లు పరిశీలించారు. వారికి పలు సూచనలు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 20 లక్షల డబ్బులు సీజ్ చేశామని, తదుపరి విచారణ కోసం పోలీసులకు అప్పగించామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో నోడల్ అధికారులు



నవీన్ కుమార్, భారతి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సిరిసిల్ల మూడవ జాబితా విడుదల




- విడుదల చేసిన బీఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి తుల ఉమ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల మూడవ జాబితాను బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసింది. మూడవ జాబితాలో మొత్తం 08 మంది అభ్యర్థులను ప్రకటించినట్లు బీఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి తుల ఉమ తెలిపారు.

## సిరిసిల్లలో కాంగ్రెస్ కు షాక్..

### కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్ లోకి చేరికలు..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
మున్సిపల్ ఎన్నికల వేల సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ నుండి ఆరవ వార్డు నాయకులు దూడం రజని శ్రీనివాస్ సిరిసిల్ల తెలంగాణ భవన్ లో కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. గులాబీ కండువా కప్పి దూడం రజని శ్రీనివాస్ తో పాటు వారి అనుచరులను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు కేటీఆర్, 1వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నేత బూర బాలు పెద్ద సంఖ్యలో తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ లో చేరారు. కేటీఆర్ వారికి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్ తో పాటు మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి తుల ఉమ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, కెడిసిసిబి మాజీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు,జిందం చక్రపాణి, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగ రావు,జెడ్పి వైస్ చైర్మన్ సిద్ధం వేణు తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఇల్లంతకుంటలో మహాత్మా గాంధీ వర్ధంతి



**బలగం టీవీ, ఇల్లంతకుంట:**
జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఇల్లంతకుంట మండల కేంద్రంలో సర్పంచ్ యం.రాజు మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యం.రాజు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ గారు దేశ స్వాతంత్ర్య సాధనలో అహింస, సత్యం అనే మార్గాలను ప్రపంచానికి చాటిచెప్పిన మహానుభావుడని తెలిపారు. గాంధీ గారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి, సమాజ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు రేగుల కార్తీక్, చేరాల వంశీకృష్ణ, అంతటి శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు మామిడి నరేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎర్రోజు సంతోష్ కుమార్, మైనారిటీసెల్ మండల అధ్యక్షులు జమాల్, ఆర్యవైశ్య సంఘం నాయకులు అప్పయ్య సేటు, నార్ల రాంకిషన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కూనబోయిన బాలరాజు, రవీందర్ రెడ్డి, పర్శరాం, అప్పయ్య సేటు, కూనబోయిన సుధాకర్, హైదర్ చంద్రయ్య, నర్సయ్య, అంజయ్య యువజన సంఘాల సభ్యులు ఎర్రోజు రవితేజ, తాటిపెల్లి శ్రీనివాస్, ఎలుక పవన్ తదితరులు పాల్గొన్నారు.



# సిరిసిల్లలో భారీగా పట్టుబడ్డ నగదు

- తనిఖీల్లో రూ. 20 లక్షలు స్వాధీనం..
- సిరిసిల్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కొనసాగుతున్న తనిఖీల్లో భాగంగా సిరిసిల్ల పరిధిలోని రగుడు చౌరస్తా చెక్‌పోస్ట్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. వేములవాడకు చెందిన ఓ గణాచారి సంభాషివ్ ఎటువంటి ఆధారాలు లేకుండా తన కారు లో రూ.20 లక్షల నగదును తరలిస్తుండగా పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. నగదుకు సంబంధించి సరైన పత్రాలు చూపలేకపోవడంతో, ఎన్నికల నిబంధనల ప్రకారం ఎస్ఎస్‌టీ బృంద ఇన్‌చార్జ్ జి. ఆనంద్, ఏపీఓ సమక్షంలో, పంచనామా సాక్షుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు.నగదును సీజ్ చేసి విచారణ ప్రారంభించినట్లు సిరిసిల్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. కృష్ణ తెలిపారు.



# వేములవాడ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న చేరికలు..

- కాంగ్రెస్ పార్టీలో చేరిన గోపన్నగారి మాధవి లత
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ:**
వేములవాడ కాంగ్రెస్ పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. వేములవాడ మున్సిపల్ 28వ వార్డుకు చెందిన గోపన్నగారి మాధవి లత బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాధవి లతకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని అన్నారు. గత ఎన్నికల్లో 28వ వార్డులో మాధవి లత స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారని గుర్తు చేశారు. గత పది సంవత్సరాల పాలనలో గత ప్రభుత్వం వేములవాడ అభివృద్ధిని విస్మరించిందని అన్నారు. ప్రస్తుతం వేములవాడ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలు గమనించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సుకన్య యోజన పథకం ఆడపిల్లలకు గొప్ప అవకాశం

- సర్పంచ్ నిమ్మ భాగ్యలక్ష్మి-శ్రీనివాస్ రెడ్డి

**బలగం టీవీ, బోయినిపల్లి:**
రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం దేశాయిపల్లి గ్రామ సర్పంచ్ నిమ్మ భాగ్యలక్ష్మి–శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సుకన్య యోజన పథకం కింద ఆడపిల్ల జన్మించిన వారికి ఆర్థిక సాయంగా 5000 రూపాయలు పోస్ట్ ఆఫీస్ లో 20 సంవత్సరాలు వరకు పిక్స్ డిపాజిట్ చేయడం జరుగుతుంది. ఇటీవల కళ్యాణం వెంకటేష్–లహరి దంపతులకు ఆడపిల్ల పుట్టిన సందర్భంగా 5000 రూపాయలు పోస్ట్ ఆఫీస్ లో ఫిక్స్ డిపాజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కురుమ మనోహర్, వార్డు సభ్యులు మరియు జె.ఎ.సి చైర్మన్ మాడిశెట్టి గంగయ్య వైస్ చైర్మన్ బత్తిని హరీష్ గౌడ్, మానేరు లక్ష్మారెడ్డి, నిమ్మ అంజిరెడ్డి, గోపి బాపురెడ్డి, నిమ్మ రాజిరెడ్డి, కురుమ శ్రీనివాస్, రవి, కట్కూరి సుదర్శన్, కుడుకల దుర్గయ్య, పొన్నాల మల్లేశం, పెండ్యాల మహిపాల్ రెడ్డి, గోపి శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కి సిట్ నోటీసులివ్వడాన్ని ఖండించిన ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం.



**బలగం టీవీ, హైదరాబాద్:**
తెలంగాణ జాతిపిత, రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కి సిట్ నోటీసులివ్వడాన్ని తీవ్రంగా ఖండించిన ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపి ప్రజలంతా గర్వించేలా చేసిన నాయకుడిని, అగౌరపరిచి ఇబ్బంది పెట్టడాన్ని ఎన్నారైలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అనిల్ కూర్మాచలం తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి పాలన చేతకాక కక్ష సాధింపులతో కాలాన్ని గడుపుతుందని, ఇలాంటి నోటీసులతో కేసీఆర్ ని ఏమీ చెయ్యలేరని, ఇంతకంటే పెద్ద పెద్ద నాయకులతోనే కొట్లాడి నిలిచి గెలిచి తెలంగాణను గెలిపించిన ధీరుడు కేసీఆర్ వెంటే ఎన్నారైలంతా ఉన్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ కుట్ర రాజకీయాలని దేశమంతా తెలియజేసేలా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక నిరసన కార్యక్రమాలు చేపడతామని అనిల్ కూర్మాచలం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# సమ్మక్క చరిత్ర -- మేడారం జాతర వెనుక చారిత్రక నేపథ్యం



**బలగం టీవీ, మేడారం**

ప్రపంచంలోనే అరుదైన గిరిజనోత్సవంగా పేరుగాంచిన మేడారం సమ్మక్క--సారక్క జాతరకు ఘనమైన చారిత్రక నేపథ్యం ఉంది. నాలుగైదు రాష్ట్రాల నుంచి గిరిజనులు, మైదాన ప్రజలు తరలివచ్చే ఈ జాతర రెండేళ్లకు ఒకసారి సాంప్రదాయబద్ధంగా నిర్వహించబడుతుంది. సమ్మక్క, సారక్క, పగిడిద్దరాజుల వీరగాథలే ఈ జాతరకు ఆధారంగా నిలిచాయి. ఈ గిరిజనోత్సవం సాంప్రదాయిక గిరిజన ఆచారంగా గౌరవించబడుతున్నది. సమ్మక్క, సారక్క, పగిడిద్దరాజులకు గద్దెలు కట్టి జాతరచేయడానికి కారణం వాండ్లు కాకతీయులతో పోరాడి వీరమరణం పొందడమేనని కైఫీయత్తులు చెప్తున్నాయి.

గిరిజనులలో 'అమ్మ' దేవతారాధన అతిప్రాచీనమైనది. గిరిజనులు తమ నాయకుల్ని గౌరవాదరాలతో చూడ్డమే కాదు, వారిని అర్ధదేవతలు గా పూజిస్తారు కూడా. వారికి ప్రత్యేకంగా అతీతశక్తులున్నాయని నమ్ముతారు. గిరిజన ప్రజలు తమ పాలకులను దేవుళ్లుగా కొలువడంకూడా సాధారణమే. ప్రకృతిని ఆరాధించే గిరిజనులు వానని, పుష్పించిన అడవిని, బతుకునిచ్చే చెట్లను, నీటిచెలిమెలను, గుట్టలను, పులివంటి జంతువుల్ని దేవతలుగా కొలుస్తారు. ముఖ్యంగా వారు మామిలి, కొమ్మలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ, కాటురుడు, ఏడమరాజు, కుడిదేవర, ముసలమ్మలను ఆరాధిస్తారు. ఏ దేవతకు గుడిలేదు. విగ్రహాలు లేవు, మంత్రాలు లేవు. అన్నీ ప్రాకృతిక పూజలే. మరాఠా కోయలు దేవుణ్ణి 'పేన్' అని పిలుస్తారు, తెలుగుకోయలు 'వేల్పుల'ని. మేడారంలో జరిగే సమ్మక్క-సారక్కల జాతర గిరిజనుల సాంప్రదాయికమే. రెండేండ్లకు ఒకసారి చేసే ఈ పండుగ వారి ఆనవాయితీ. కాకతీయులు ఎందునాగాని ఇంత చిన్న మేడారం పరగణా మీద దాడిచేయడానికి పగిడిద్దరాజు చక్రవర్తులకు పన్ను కట్టకపోవడమన్నది కారణం అవుతుందా? కాదు. అంతకన్నా మించిన మూలకమేదో వుండివుండాలి. ప్రతాపరుద్ర చక్రవర్తి కాలంలో అతని మంత్రి యుగంధరుడి ఆధ్వర్యంలో జరిగిందని చెప్పబడుతున్న జంపన్నవాగు యుద్ధం ఏ ప్రతాపరుద్రునికాలంలో జరిగివుంటుంది.

ఇటీవల ప్రచురించబడ్డ 'Goddess of Folk-Sammakka and Saralamma Jatara'లోని 277వ పేజీలో పేర్కొనబడ్డ శాసనంలో 'సమ్మక్క దేవతల ఉత్సవ.....కాకతీయ రాజ్య...కానుకలు..... బంగారము మా ప్రజల నుంచి చేర్చమని వినతి........పగిడిద్దరాజు జ్ఞా.... పౌర్ణమి కానుకలు కాకతీయ సైన్యాధిపతి ఆజ్ఞ మేరకు' అనివుంది. ఈ శాసనమెప్పటిది. శాసనలిపి, భాషలను బట్టి మొదటి ప్రతాపరుద్రునికాలం నాటిదని గ్రంథకర్తల అభిప్రాయం. (శాసన ప్రతిబింబం లేని శాసనం. ఇటువంటి శాసనభాష ఏ కాకతీయుల శాసనంలో కన్పడలేదు. దీనిలో ఆజ్ఞ చేసినవారు కాకతీయ చక్రవర్తి కాదు. సైన్యాధిపతి పేరులేదు. ఈ శాసనం విశ్వసనీయంగా లేదు.)

ఒకవేళ మొదటి ప్రతాపరుద్రుడే ఈ యుద్ధకారకుడైతే తానే ఈ జాతరకు కానుకలు పంపమని ఎందుకు ఆజ్ఞలు చేస్తాడు. చారిత్రక ఆధారాలను వెతికితే కాకతీయ సామ్రాజ్యానికి, మేడారానికి సబబైన యుద్ధకారణాలు మనకు దొరకవచ్చు. కాకతీయ రుద్రదేవుని (1158-1195)కాలంలోనే ఈ మేడారం యుద్ధం జరిగివుంటుంది.

మేడారం ప్రాంతాన్ని పాలించే సామంతుడైన పగిడిద్దరాజు కప్పం చెల్లించలేకపోయినందుకు మొదటి రుద్రదేవుడు పంపించిన సేనాధిపతి గంగాధరమంత్రితో యుద్ధం చేయవలసివచ్చిందా? ఔనని ఒక కథనం. కాకతీయ సైన్యం ముందర గిరిజనసైన్యం నిలువలేకపోయింది. పగిడిద్దరాజు కుటుంబం సర్వం నిశ్శేషంగా హతమైంది. కప్పం కట్టకపోతే చక్రవర్తి పగిడిద్దరాజును బంధించవచ్చు. శిక్షించవచ్చు. కప్పం రాబట్టే విధానం యుద్ధం కాదుకదా. మరొక విధంగా కాకతీయరాజ్య విస్తరణలో భాగంగానే మేడారం రాజ్యాన్ని వశపరచుకోవడానికే రుద్రదేవుడు ఈ యుద్ధం నడిపించాడా? కావచ్చు. కాలచురిరాజు బిజ్జలుడికి కళ్యాణీచాళుక్యరాజ్యంపై ఎప్పటినుండో ఆశవుంది. బిజ్జలుడు తన కొడుకు మైలగికి రెండవ మేడరాజు, గుండరాజు, దొమ్మరాజు, భీమదేవచోడులతో మిత్రసమాఖ్యనేర్పరచి, మూడో తైలపుణ్ణి రెండవ జగదేకమల్లున్ని సింహాసనం నుంచి తొలగించడానికి ఉసిగొలిపాడు. తైలపుడు రెండవ జగదేకమల్లుని సమర్థించే 2వప్రోలునిపై కూడా దాడి చేసాడు. రెండవప్రోలునితోపాటు మొదటి రుద్రదేవుడు, గోకర్ణదేవచోడుడు యుద్ధంలో పాల్గొన్నారు. నగునూరు ప్రభువు దొమ్మరాజు, పొలవాస రాజు మేడరాజులు కాకతీయులతో శత్రుత్వం కారణంగా అవకాశాన్ని వినియోగించుకోవాలనుకున్నారు. ఈ యుద్ధంలో(క్రీ.శ. 1150 ప్రాంతంలో) దొమ్మరాజు మరణించాడు. మైలగి కళ్యాణి వరకు తరిమివేయబడ్డాడు. మేడరాజు అడవుల పాలయ్యాడు. హన్మకొండ శాసనంలో(క్రీ.శ.1163) పొలవాసరాజు, ఏడరాజు పరాజయాన్ని, పలాయనాన్ని, గుండరాజు మరణాన్ని గురించి చెప్పబడివుంది.

ఈ సందర్భంలోనే రుద్రదేవుడు మేడరాజు తన ఓటమిని అంగీకరించి, కూతురు సమ్మక్కను ఇవ్వవలసిందిగా సంధి రాయబారం చేసివుంటాడు. అందుకు అంగీకరించని మేడరాజు రుద్రదేవునికి అందనంత దూరం అడవుల్లోపలికి వెళ్ళిపోయాడు.(సుంకిరెడ్డి నారాయణరెడ్డి- తెలంగాణ చరిత్ర-2011,పే.107) మేడరాజు జాడలు కనుక్కుని, మేడరాజుకు ఆశ్రయమిచ్చిన పగిడిద్దరాజు మీద గంగాధరమంత్రి చేత దాడి చేయించివుంటాడు రుద్రదేవుడు. మొదటి రుద్రదేవునికి కాకతీయరాజ్య విస్తరణకు అడ్డుగా వున్న కోయరాజ్యాన్ని లోబరచుకోవాలన్నది ఒక కారణమైతే, తనకు లొంగకుండా, అడిగినా బిడ్డనివ్వకుండా అడివిలో చేరి రాచగోండుల రాజ్యాన్ని విస్తరింప చేస్తున్నాడన్నది రెండవ కారణం.

ఇటీవలి పరిశోధనల ప్రకారం సమ్మక్కతల్లి చందంబోయిరాలు చంద్రాపూర్ రాజధానిగా రాజ్యమేలిన రాచగోండుల వంశానికి చెందిన స్త్రీ. తండ్రి రాయిబండనిరాజు మేడారం పరగణా నాయకుడు. సమ్మక్కను పెండ్లాడిన పగిడిద్దరాజు మేడరాజుకు మేనల్లుడు. తమకల్లుడైన పగిడిద్దరాజు మామ మేడరాజుకు మద్దతుగా నిలిచారు రాచకోయలు. ఆత్మాభిమానధనులైన రాచకోయలు కాకతీయులకు లొంగడానికి, మేడరాజును అప్పగించడానికి ఇష్టపడనందువల్లనే 'జంపన్నవాగు' ఒడ్డున యుద్ధం జరిగింది. సమ్మక్క, సారమ్మలు యుద్ధంలోనే మరణించి వుంటారు. మేడరాజు కూడా యుద్ధంలోనే బలైవుంటాడు. బలవం తులైన కాకతీయుల సైన్యంతో తలపడి ఆత్మసమర్పణం చేసుకున్నది ఒక గిరిజన స్వతంత్రరాజ్యం. మేడరాజు పేరుమీద గూడాలు వెలిసాయి. పగిడిద్దరాజు, సమ్మక్క, సారక్కల పేరుమీద వీరగద్దెలు కట్టి జాతర ప్రారంభించారు మేడారం పరగణా ప్రజలు. సమ్మక్క దేవతయింది. వీరారాధన దేవతారాధనగా మార్పు పొందింది.

సమ్మక్కబిడ్డలు జంపన్న, సారలమ్మలు యుద్ధంలో పాల్గొనివుంటే వారు యుక్తవయస్కులై వుండాలి. అంటే ఈ యుద్ధం 1190కి ముందో, వెనకో జరిగివుంటుంది. ఆ తరువాత 1195లో జైతుగితో యుద్ధంలోనే రుద్రదేవుడు మరణించాడు.



## కేసీఆర్‌కు సిట్ నోటీసులు తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి..

- **మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

**బలగం టీవీ, హైదరాబాద్?:**



ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో గౌరవ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కి సిట్ నోటీసులు ఇవ్వడాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావుకు, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌రావుకు సిట్ నోటీసులు ఇచ్చి విచారణ జరిపింది.నిప్పు లాంటి కేసిఆర్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్న రేవంత్ రెడ్డి ఖబర్దార్రాష్ట్రంలో ఇందిరమ్మ పాలనా పేరుతో రేవంత్ రెడ్డి కెసిఆర్ కుటుంబం పై రివెంజ్ పాలిటిక్స్ నడిపిస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి రోజుకో డ్రామాతో డైవర్సన్ రాజకీయాలు చేస్తున్నాడనిఏకంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కూడా ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడ్డాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తప్పు పట్టారు.కేసీఆర్ గారికి సిట్ నోటీసులు ఇవ్వడం అంటే తెలంగాణ రాష్ట్ర ఆత్మ గౌరవానికి నోటీసు ఇచ్చినట్లేనని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కే సి ఆర్ గారికి సిట్ నోటీస్ ఇవ్వడం కాంగ్రెస్ అధికార దుర్వినియోగనికి పరాకాష్టగా వ్యక్తిగత కక్షతో కేసీఆర్ పైన వారి కుటుంబం పైన ఏదో ఒక కేసును మోపుతూ వారిని కూడా ఏదో రకంగా జైలుకు పంపాలని కక్ష సాధింపు చర్యలలో భాగమేనని అన్నారు. రేవంత్ రెడ్డి సింగరేణి టెండర్ల లో అవకతవకలు జరిగాయని బిఆర్ఎస్ పార్టీ సాక్ష్యాలతో సహా రుజువు చేస్తే, దానిపై సిట్ విచారణ చేయాల్సింది పోయి, బిఆర్ఎస్ పార్టీ నాయకులకు నోటిసులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయాలని ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాడుతుంటే దాని డైవర్షన్ చేయడానికి ఈ ఫోన్ టాపింగ్ కేసును ముందుకు తీసుకొస్తున్నారని ప్రజలందరూ దీన్ని గమనిస్తున్నారని అన్నారు. పరిపాలన విధివిధానాలు తెలియని వాళ్ళు పాలకులుగా ఉండటం దురదృష్టకరం,

## కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్షసాధింపే..

- **కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ డ్రామాలు**
- **మున్సిపల్ ఎన్నికల వేళ అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్**
- **ప్రజా వ్యతిరేక రేవంత్ సర్కార్‌కు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం**
- **బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. తుంగ బాలు**

**బలగం టీవీ, హైదరాబాద్?:**



తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కి ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ (రాక్షీు) నోటీసులు జారీ చేయడాన్ని బిఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ తుంగ బాలు తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్నది ప్రజా పాలన కాదని, అది పూర్తిగా 'ప్రతీకార పాలన' అని ఆయన మండిపడ్డారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తన అసమర్థతను దాచుకోవడానికే ఇటువంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. "ప్రజా ప్రభుత్వం" అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలను, 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. నిరుద్యోగం పెరిగిపోవడం, అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్ పై నోటీసుల డ్రామాకు తెరలేపారని అన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగనున్న తరుణంలో, కావాలనే ఈ నోటీసులు ఇచ్చారని తుంగ బాలు ఆరోపించారు. ప్రతిపక్షం గొంతు నొక్కాలని, రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన ఉద్యమ నాయకుడిపై, పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా నిలిపిన విజనరీపై వేధింపులకు దిగడం దుర్మార్గం. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు. ఎన్ని అటెన్షన్ డైవర్షన్ డ్రామాలు ఆడినా, రాబోయే రోజుల్లో రేవంత్ సర్కార్‌కు కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమని డా. తుంగ బాలు హెచ్చరించారు.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్ట్ ను ఖండిస్తున్నా..

- **పోలీసుల తీరు ఆక్షేపనీయం.**
- **మాజీ ఎం.పీ. బోయినపల్లి వినోద్ కుమార్**

**బలగం టీవీ, హుజూరాబాద్:**



హుజూరాబాద్ నియోజకవర్గం వీణవంక గ్రామంలో జరుగుతున్న సమ్మక్క--సారక్క జాతర సందర్భంగా దివ్య దర్శనానికి వెళ్లిన స్థానిక శాసనసభ్యులు పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయదాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా, పోలీసులు అనుసరించిన తీరు అక్షేపనీయమని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలక సభ్యులు సమ్మక్క--సారక్కలను దర్శించడానికి వచ్చిన సమయంలో ప్రభుత్వ అధికారులు, పోలీస్ సిబ్బంది అనుసరించిన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాని అన్నారు. జాతర సమయంలో భక్తులకు శాంతియుతంగా దివ్య దర్శనం కల్పించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటిని విస్మరించి కౌశిక్‌రెడ్డి కేవలం తన సతీమణి, కూతురుతో దివ్య దర్శనానికి వెళ్లిన సందర్భంలో అరెస్ట్ చేయడం న్యాయస్థాన ఆదేశాలను అవమానించడమేనని, ప్రభుత్వ అధికారులు ఈ విధమైన చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. కోర్టు ఆదేశాలను గౌరవిస్తూ భక్తులందరికీ ఎలాంటి అడ్డంకులు లేకుండా శాంతియుతంగా దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.